## బీసీ బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

**కాచిగూడ:** రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ లోనూ ఆమోదం పొందేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్ని రాజకీయ పార్టీలకు శనివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జనగణనలో కుల గణనపై కేంద్రం తన వైఖరి మార్చుకుని సానుకూలంగా స్పందించాలని కోరారు. అలాగే కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ల పంపిణీ

**కాచిగూడ:** జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని అంబర్‌పేట మసీదు వద్ద ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ముస్లింలకు ప్లాస్టిక్ కవర్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ముషీరాబాద్:** నియోజకవర్గ బీజేవైఎం కోకన్వీనర్ శ్యామ్ ఆధ్వర్యంలో వీఎస్టీ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నవీన్‌గౌడ్, వంశీతో పాటు పలువురు పాల్గొన్నారు.

## శాలివాహన జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**ముషీరాబాద్:** ప్రథమ ఆంధ్ర మహాపాలకుడు శాలివాహన చక్రవర్తి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎల్ల గౌరీపతిరావు కోరారు. శాలివాహన చక్రవర్తి జయంతిని పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహం వద్ద శనివారం నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కుమ్మరి సామాజిక వర్గాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సుదర్శన్, ఆర్.మోహన్‌రావు, నాయకులు పి.రామ్మోహన్‌రావు, కోశాధికారి ప్రవీణ్, ఉప్పలపాటి క్షీరసాగర్, ప్రసాద్ బాబు, చంద్రకాంత్, వీరబాబు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం


సునీత

**చిక్కడపల్లి:** మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడిక్‌మెట్, నల్లకుంట, ముషీరాబాద్ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ నాగమయ్యకుంటలో నివసించే సునీత (33) శుక్రవారం సాయంత్రం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే వెంటనే 8712660160, 8712660162, నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## కనీస వేతనాల సవరణపై కార్మిక సంఘాల ధర్నా

**ముషీరాబాద్:** రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించాలని, గత సంవత్సరం డిసెంబర్‌లో విడుదల చేసిన జీవో నెంబర్ 21,22,23,24,25లను గెజిట్ చేయాలని పలు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్‌చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కనీస వేతనాల సవరణపై ఆల్ ట్రేడ్ యూనియన్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, సీఐటీయూ ఉపాధ్యక్షులు భూపాల్, పాలడుగు భాస్కర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు అంజద్‌ఖాన్, రెబ్బ రామారావు, టీయూసీఐ ఎస్.ఎల్.పద్మ, కె.సూర్యం, ఐఎన్‌టీయూసీ నేతలు అనురాధ, ఎం.శ్రీనివాస్, బీఆర్‌టీయూ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. 2021 జూన్‌లో ఐదవ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌కు ఫైనల్ జీవోలను జారీ చేశారని, వాటిని వెంటనే గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

## పోక్సో కేసులో 25 ఏళ్ల జైలు

**నల్లకుంట:** పోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నాంపల్లి 7వ మెట్రోపాలిటన్ అదనపు సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కొందుర్గ మండలం పీర్జాపూర్ గ్రామానికి చెందిన రాజనాల రమేశ్ అలియాస్ పిచ్చకుంట్ల రమేశ్, అలియాస్ వెంకటేశ్ (26) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. వీధుల్లో చిత్తు కాగితాలు సేకరిస్తూ కాచిగూడ రైల్వే స్టేషన్ పరిసరాల్లోని పుట్‌పాత్‌పై నివసిస్తున్నాడు. కాగా 2023లో నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన నల్లకుంట పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుపై ఈ నెల 21న వాదోపవాదనలు విన్న 7వ మెట్రోపాలిటన్ కోర్టు అడిషనల్ సెషన్ న్యాయమూర్తి అనిత నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే బాధిత కుటుంబానికి 3 నెలల్లోగా రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని, లేకుంటే మరో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించడంతో పాటు రూ. 5 వేల ఫైన్ కూడా చెల్లించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారు.

# పరికరాలు.. పనికిరావు.!

### సుందరయ్య పార్కులో విరిగిన ఆట పరికరాలు

కనీస మరమ్మతులు చేపట్టని అధికారులు ● ఆట వస్తువులు లేక చిన్నారుల్లో నైరాశ్యం


సుందరయ్యపార్కులో మూలన పడ్డ చిన్నపిల్లల ఆట పరికరం

**సుందరయ్యవిజ్ఞానకేంద్రం:** నగరంలో ప్రతిష్టాత్మకమైన సుందరయ్యపార్కు నిత్యం వాకర్స్, వృద్ధులు, చిన్నపిల్లలతో రద్దీగా ఉంటుంది. ప్రతిరోజు సాయంత్రం పూట చిన్నపిల్లలతో పార్కు కిక్కిరిసిపోతోంది. అయితే ఈ ఉద్యానవనంలో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట పరికరాలు ఏడాదికి పైగా విరిగిపోయి మూలనపడ్డాయి. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి ఈ పార్కుకు పెద్ద సంఖ్యలో వచ్చే పిల్లలకు ఆట వస్తువులు లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. పెద్దలు వాకింగ్ చేస్తుంటే చిన్నారులంతా ఆటల్లో మునిగిపోతారు.


విరిగిన ఉయ్యాల

◆ ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూచక్రం, ఉయ్యాల, తదితర పరికరాలన్నీ విరిగి మూలన పడ్డాయి. అయినా ఉద్యానవన నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. కనీసం మరమ్మతులు కూడా చేయించకపోతే ఎలా అని వాకర్స్ ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యే నాటికైనా ఆట పరికరాలను తిరిగి వినియోగంలోకి తెస్తారో లేదోనని సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పిల్లల ఆట పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### సుందరంగా వాకింగ్ ట్రాక్..

పార్కులోని వాకింగ్ ట్రాక్ ఎంతో సుందరంగా ఆధునీకరించారు. 11 నెలల క్రితం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోని వాకింగ్ ట్రాక్ లో మట్టి వేసి మరమ్మతులు చేయించారు. దాంతో పాటు సుందరయ్యపార్కులో మొక్కలు నాటారు. అంతేకాకుండా గడ్డిని వేశారు. ఇంకుడు గుంతలను కూడా ఏర్పాటు చేశారు. ఈ వాకింగ్ ట్రాక్‌ను ప్రతిరోజు ఇందులో పనిచేస్తున్న కార్మికులు శుభ్రంగా ఊడ్చడంతో పాటు ఉదయం 4.30గంటలకే నీళ్లు కొట్టి వాకింగ్ చేయడానికి అనుకూలంగా ఉండేటట్లు చేస్తారు.


వాకర్స్‌కు అనుకూలంగా మార్చిన వాకింగ్ ట్రాక్


పార్కులో విరిగిన భూచక్రం


విరిగిన ఆట పరికరం

### ఆట పరికరాలను అందుబాటులోకి తేవాలి..



సుందరయ్యపార్కులో ఏడాదిగా నిరుపయోగంగా ఉన్న చిన్నపిల్లల ఆట వస్తువులను అందుబాటులోకి తేవాలి. అవసరమైతే కొత్త ఆట పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలి. వేసవి కాలం సమీపిస్తున్నందున అధికారులు వెంటనే స్పందించాలి. ఇక్కడికి చిన్నపిల్లలు పెద్ద ఎత్తున వస్తుంటారు.

– వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి

### అభివృద్ధి చేస్తున్నాం..



ప్రతి ఏడాది వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపడుతున్నాం. గతేడాది పార్కు సుందరీకరణలో భాగంగా సుమారు రూ.40లక్షలు ఖర్చు చేశారు. అందులో భాగంగా వాకింగ్ ట్రాక్‌ను ఆధునీకరించాం. ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో పార్కును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నాం.

– ఎస్ మనోహర్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

## నేడు సంత్ శిరోమణి గురు రవిదాస్ జయంతి

**నల్లకుంట:** సంగర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న (నేడు) సంత్ శిరోమణి గురు రవిదాస్ 648వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కోలాస్కర్ లక్ష్మణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్ రావు, కోశాధికారి కల్యాణి లక్ష్మణ్ ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిలక్‌నగర్ డాక్టర్స్ కాలనీలో గల ఉదయ్ కో–ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, 10 గంటలకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అతిథులుగా కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, బి. పద్మ వెంకట్ రెడ్డి, కన్నె ఉమారమేశ్ యాదవ్, అమృత రానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

## హర్యానా గవర్నర్ పరామర్శ



**కాచిగూడ:** బాగ్ అంబర్‌పేట డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడు పెదూరి కృష్ణ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బాగ్‌అంబర్‌పేట కుమ్మరివాడీలోని కృష్ణగౌడ్ నివాసంలో కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ కృష్ణగౌడ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కృష్ణగౌడ్ సతీమణి లావణ్య, కుమారుడు సాయినాథ్ గౌడ్, కుమార్తె నందిని, చెల్లెలు ఇందిరా, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ దత్తు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నెట్‌వర్కింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**కాచిగూడ:** యువత నెట్‌వర్కింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఏఐ డేటా ఫెస్ట్ ప్రతినిధి, ప్రముఖ పారిశ్రామిక డేటా నిపుణుడు దావల్ పటేల్ సూచించారు. ఏఐ డేటా ఫెస్ట్ ఆధ్వర్యంలో నారాయణగూడలో విద్యార్థులు, యువతకు శనివారం నెట్ వర్కింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐ డేటా సైన్స్ అనలిటిక్స్‌లో పురోగతులను పరిశోధించేందుకు ప్లాట్‌ఫారమ్‌గా ఇలాంటి వర్క్‌షాపులు దోహద పడతాయన్నారు. పరిశ్రమ నిపుణులతో నేరుగా కనెక్ట్ అయ్యే అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే యువతకు నెట్‌వర్క్ నైపుణ్యాలను తెలియజేశారు. నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు రూపొందించిన ప్రాజెక్టును వివరించారు.

## దక్షిణ భారతదేశానికి ఎక్కడా అన్యాయం జరగదు


అరుంధతినగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్

**చిక్కడపల్లి:** దక్షిణ భారతదేశానికి ఎక్కడ అన్యాయం జరగదని, దేశంలోని అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో శనివారం సాయంత్రం రూ.20 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులు, మరో రూ.10 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న వాదనలో నిజం లేదన్నారు. ఇదంతా ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారమని కొట్టిపారేశారు. కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

**నగరంలో శ్మశానవాటికల కొరత**

**ముషీరాబాద్:** హైదరాబాద్‌లో శ్మశానవాటికల కొరత ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఉన్న వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో గల హిందూ శ్మశానవాటికలో రూ.32 లక్షలతో చేపట్టిన పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న శ్మశానవాటికలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించి మౌలిక వసతులను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. శ్మశానవాటికల కొరతల వల్ల కొన్నిచోట్ల స్థానికుల మధ్య ఘర్షణలు సైతం జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఏపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి


సదస్సులో మాట్లాడుతున్న కృష్ణ కన్నయ్య పల్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని సమాజ్‌వాది పార్టీ అడ్వకేట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు కృష్ణ కన్నయ్య పల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో శనివారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పూర్తిగా దెబ్బతీయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. దళిత బహుజనులు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉత్తమ భారతీయ సమాజ్ సేవా సంఘ్ అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వంశీకృష్ణ, ప్రొఫెసర్ టి.వెంకటరాజయ్య, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో ఉచిత టీచర్ ట్రైనింగ్ కోర్సు

**కాచిగూడ:** జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో అందించే ఉచిత కరాటే టీచర్ ట్రైనింగ్ కోర్సు పోస్టర్‌ను అంబర్‌పేటలోని డీసీపీ కార్యాలయంలో అంబర్‌పేట ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఈ కోర్సు ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 10 లోగా కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో పేర్లను నమోదు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సోమేశ్వర్‌రావు, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, డాక్టర్ ఎ.బాలరాజు, కరాటే బ్లాక్‌బెల్ట్ అమృత రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్:** అడిక్‌మెట్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పావని, అర్జున్, మన్మోహన్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ముఠా జైసింహ, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ అధ్యక్షుడు యాదగిరి, మాజీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, కడప సురేందర్, అనురాధా, ముచ్చుకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంపై ఒత్తిడి తేవాలి

**కాచిగూడ:** బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో 18 బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. బీసీ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, కోలా జనార్దన్, జిల్ల నరేందర్, రామకోటి, అనంతయ్య, మణికంఠ, భాగ్యలక్ష్మి, జల్లెపల్లి కిరణ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాపోటీలు ప్రారంభం

**కాచిగూడ:** వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు, వైశ్య హాస్టల్ సంయుక్తాధ్వర్యంలో 'స్పోర్ట్స్‌మీట్–2025'లో భాగంగా కాచిగూడలోని హాస్టల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఉప్పాల రాజేశ్వర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్, క్యారం, షటిల్, డాట్‌నెట్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైశ్య హాస్టల్ ప్రధాన కార్యదర్శి పబ్బతి రవి ప్రసన్న కుమార్, పొద్దుటూరి రాజేశ్వర్ రావు, వీరబొమ్మ శ్రీనివాస్, కూర జయరాములు గుప్తా, తీరటిపల్లి శ్రీనివాస్, హాస్టల్ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


చెస్ పోటీలు ప్రారంభిస్తున్న రాజేశ్వర్

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


ప్రమాణా స్వీకారంలో పాల్గొన్న ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్

**ముషీరాబాద్:** ఆలయాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయ నూతన చైర్మన్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ అండాలు ఆలయ కమిటీ చైర్మన్‌గా వి.ఆనంద్‌ముదిరాజ్, ధర్మకర్తలుగా జి.మీనా, గోవర్ధన్‌రెడ్డి, రాంచందర్, యాదగిరి, ప్రశాంత్‌తో ప్రమాణా స్వీకారం చేయించారు. అనంతరం అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రావి వెంకటరెడ్డి, ఆర్.కల్పనాయాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్, నాయకులు జీఎస్ కేశవ్, వరదరాజు, కర్ణం సురేశ్, విజయ్‌యాదవ్, తిరుమల్, శ్రీకాంత్‌గౌడ్, పెండెం శ్రీనివాస్ యాదవ్, లింగం గుప్తా, వెంకటేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం.నగేశ్ ముదిరాజ్, అస్లాం, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి


అవంతి ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జలమండలి అధికారులు

**నల్లకుంట:** నీటిని పొదుపుగా వాడుకోవాలని లేకుంటే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తప్పవని జల మండలి శివం సెక్షన్ మేనేజర్ ఆర్ఎస్. రోహిత్ పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డివిజన్–5, సబ్ డివిజన్–3 సంయుక్తాధ్వర్యంలో నల్లకుంటలో 'జల సంరక్షణ ఆవశ్యకత'పై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యూ నల్లకుంట నరేంద్ర పార్క్‌లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ (ఆర్‌డబ్ల్యూహెచ్) పిట్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. అనంతరం న్యూ నల్లకుంటలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అవంతి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, మార్పు ఎన్జీవో సంస్థ ప్రతినిధులతో కలిసి శివం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ వాటర్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జన్నాథ రావుతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజలకు సరిపడా తాగునీటిని అందిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మంచినీటిని వాడుకున్న తర్వాత కుళాయిలు కట్టేయడం లేదన్నారు. దీంతో నీరంతా వృథాగా పోతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌టీ ఏఎస్‌వో సంజీవ కుమార్, అవంతి కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు, మార్పు ఎన్జీవో సంస్థ, నరేంద్ర పార్క్ అసోసియేషన్ సభ్యులు హైమావతి రాజేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కో ఆర్డినేటర్ అశోక్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలి'



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** పెట్టుబడిదారుల మార్కెట్ ప్రయోజనాల కోసమే ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్నారని, వాటిని రద్దు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లిలోని వీరనారి ఐలమ్మ ట్రస్ట్ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మే 7 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీ పోటీలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పోటీలక మద్దతుగా పర్యాటక, సంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడడం విచారకమన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకులు అంతర్జాతీయ వేడుకలు నిర్వహించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కాస్మోటిక్ వస్తువులను అమ్ముకోవడం తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. పోటీలు రద్దు చేయకుంటే పలు దశల్లో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఎస్.ఆశాలత, కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**కాచిగూడ:** పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, అలాగే వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నింబోలిఅడ్డా సమోసా పార్కు వద్ద, చెప్పల్‌బజార్ మహేంద్ర గార్డెన్ వద్ద రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లకుండా ఐరన్ గార్డ్స్, కాచిగూడ పోలీస్ స్టేషన్ నుంచి నింబోలిఅడ్డా రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే నారాయణగూడలో నిర్మించిన మోడ్రన్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలని విన్నవించానన్నారు.